# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 66 | పేజీలు: 4 | వెల: రూ.4/- | మంగళవారం 28 అక్టోబర్ 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## జస్టిస్ గవాయ్‌పై బూటు విసిరిన కేసు

### కోర్టు ధిక్కరణ చర్యలకు విముఖత

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం) సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై ఓ న్యాయవాది దాడి చేసిన ఘటనపై కేసు నమోదుకు జస్టిస్ గవాయ్ విముఖత చూపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు చేయరాదని నిర్ణయించారు. ఈ ఘటన తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై కోర్టు ధిక్కార చర్యలకు అనుమతించబోమని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఈ విషయంపై సీజేఐ ఎటువంటి కేసు నమోదు చేయలేదని.. అతడిపై చర్యలు తీసుకోవడానికి భారత ప్రధాన న్యాయమూర్తి విముఖత చూపారని తెలిపింది. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం

### తక్కువ వ్యయంతో ప్రాణహిత చేవెళ్ల పునరుద్ధరణ

### ప్రభుత్వం పరిశీలనలో ఉందన్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం)

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుని తక్కువ వ్యయంతో పునరుద్ధరించేలా తమ ప్రభుత్వం ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో నీటిపారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి ఉత్తమ్ దిశానిర్దేశర చేశారు. సుందిల్లా లింక్ ద్వారా కొత్త అలైన్‌మెంట్‌తో 10 నుంచి 12 శాతం వ్యయం తగ్గే అవకాశం ఉందని వివరించారు. భూసేకరణ సగం మేరకు తగ్గే అవకాశం ఉందని తెలిపారు. సుమారు రూ.1,500 నుంచి 1,600 కోట్లు ఆదా అవుతుందని చెప్పుకొచ్చారు. కొత్త అలైన్‌మెంట్ సాంకేతికంగా, బలంగా ఉండేలా రూపకల్పన చేస్తున్నామని పేర్కొన్నారు. నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణతో సమతౌల్యంగా ప్రాజెక్టు రూపకల్పనపై దృష్టి పెట్టామని వెల్లడించారు. తక్కువ పొడవు ఉన్న కాలువలు, టన్నెల్‌లతో నిర్మాణ వ్యయం తగ్గనుందని వివరించారు. పంప్ హౌస్‌ల సంఖ్య 15 నుంచి 10కి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్క పంప్ హౌస్ 30మెగావాట్ల సామర్థ్యం ఉంటుందని స్పష్టం చేశారు.విద్యుత్ వినియోగం తగ్గి,నిర్వహణ సులభతరం కానుందని చెప్పుకొచ్చారు. సుందిల్లా లింక్ ద్వారా ప్రాజెక్టు పర్యావరణపరంగా సానుకూల మార్గంలో

..మిగతా 2లో



## మైనార్టీ డిక్లరేషన్ పేరుతో

# కాంగ్రెస్ మోసం



### బిజెపి స్కూల్లో శిక్షణ పొందిన రేవంత్

### బిఆర్ఎస్ హయాంలోనే వారికి మేలు జరిగింది

### మేమూ కొన్ని పొరపాట్లు చేసినా..మేలు చేశాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం)

రాష్ట్రంలో మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ మైనారిటీలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మైనార్టీల కోసం రూ.4 వేల కోట్ల బ్జడెట్ పెడతామని చెప్పి ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. తాము కూడా కొన్ని కొన్ని పొరపాట్లు చేసి ఉంటే చేసుండొచ్చు కానీ.. ఇండియాలో మైనార్టీలకు కేసీఆర్ చేసినన్ని పనులు ఇంకెవరూ చేయలేదని కొనియాడారు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో సోమవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మైనారిటీ నేతల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ విషయాన్ని ఇతర రాష్ట్రాల్లో అసదుద్దీన్ ఒవైసీ కూడా చెప్పారు.. కానీఁఇక్కడ చెప్పరని విమర్శించారు. రాష్ట్రంలో నడుస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. ఇది కాంగ్రెస్-బీజేపీ కలిసి నడిపిస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క మైనార్టీ ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ కానీ లేరని అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలోనైనా ఒక్క మైనార్టీ లీడర్‌ను కూడా ఎన్నుకోలేదని దుయ్యబట్టారు. షబ్బీర్ అలీ, అజారుద్దీన్ లాంటి వారు కూడా కాంగ్రెస్‌కు కనిపించట్లేదా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ ఇచ్చినట్లే ఇచ్చి అజారుద్దీన్‌ను పక్కన పెట్టేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రికెట్‌లో అజారుద్దీన్ కట్ షాట్‌లు కొడితే.. ఇక్కడ అజారుద్దీన్‌నే రేవంత్ రెడ్డి కట్ చేసేశారన్న ÷ర్ అయ్యారు. బుల్డోజర్ రాజ్యం నడవదని యూపీపై రాహుల్ గాంధీ విమర్శించారని.. ఇక్కడ అదే బుల్డోజర్ రాజ్యం నడుస్తుంటే రాహుల్ గాంధీ ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. హైడ్రా గురించి రాహుల్ గాంధీ సైలెంట్‌గా ఉంటారని విమర్శించారు. రాజేంద్ర నగర్

..మిగతా 2లో

# మొంథా తుపాను..

### అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం

### అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### తుపాను ప్రభావం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మీద పడకుండా చూడాలన్న మంత్రి



హైదరాబాద్, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం)

మొంథా తుపాను నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఈ తుపాను కారణంగా రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మొంథా తుపాను ప్రభావంతో రాగల నాలుగు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ తుపాను ప్రభావం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మీద పడకుండా చూడాలని, రైతాంగం ఎట్టి పరిస్థితుల్లో నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న టార్పాలిన్లను వినియోగించి ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు చేరిన ధాన్యం తడవకుండా చూడాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సత్వరమే మిల్లులకు తరలించాలని, అందుకు అవసరమైన రవాణా వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో అధికార యంత్రాంగం సమష్టిగా పని చేయాలని అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,342 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకోగా, ఇప్పటి వరకు 4,428 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు

..మిగతా 2లో

# 'చమురు'పై అమెరికా ద్వంద్వ నీతి



### ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కోవిధానం

### కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్

### ట్రంప్ సర్కారుపై విసుర్లు

కౌలాలంపూర్, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం):

రష్యా చమురు విషయంలో అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని కేంద్ర విదేశాంగ మంత్రి జైశంకర్ తప్పుబట్టారు. ఇంధన కొనుగోళ్ల విషయంలో ఒక్కో దేశం పట్ల ఒక్కో విధంగా వ్యవహరిస్తుండడాన్ని తప్పుబట్టారు. 'సెలక్టివ్'గా నిబంధనలు వర్తింపజేస్తున్నారంటూ వ్యాఖ్యానించారు. నీతులు చెప్పేవారు ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారంటూ ఆసియాన్ సదస్సులో ఆయన వ్యాఖ్యలు చేశారు. రష్యా చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై ట్రంప్ సర్కారు 25 శాతం సుంకం విధిస్తున్న సంగతి తెలిసిందే. చమురు కొనుగోళ్లను నిలిపి వేయాలని భారత్‌పై ఒత్తిడి తెస్తోంది. అదే సమయంలో ఆ దేశం నుంచి చమురు కొనుగోలు చేస్తున్న చైనా, యూరప్ మాత్రం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆసియాన్ సదస్సులో అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియోతో భేటీ అనంతరం జైశంకర్

..మిగతా 2లో



## దేశవ్యాప్తంగా

# ఓటర్ల జాబితా సవరణ

### త్వరలో ఎన్నికలు జరుగున్న రాష్ట్రాల్లో నిర్వహణ

### కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్

న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం)

దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాలలో సవరణలను చేపట్టనున్నట్టు కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ప్రకటించారు. తొలిదశ బీహార్‌లో విజయవంతంగా ముగిసిందని మలిదశ త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల్లో నిర్వహిస్తామని అన్నారు. సోమవారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలను సీఈసీ వెల్లడించారు. రెండో విడతలో 9 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటాయని చెప్పారు. వీటిలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లోని ఓటర్ల జాబితాను

## సుప్రీంకోర్టు తదుపరి సిజెఐగా

# జస్టిస్ సూర్యకాంత్

### కేంద్రానికి సిఫార్సు చేసిన ప్రస్తుత సిజెఐ గవాయ్



న్యూఢిల్లీ, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం)

సుప్రీంకోర్టు కొత్త ప్రధాన నాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ నియామకం కానున్నారు. ఆయన పేరును సీజేఐ భూషణ్ రామకృష్ణ గవాయ్ కేంద్రానికి సిఫారసు చేశారు. జస్టిస్ సూర్యకాంత్ పేరును ఒక లేఖలో కేంద్ర న్యాయశాఖ మంత్రికి ఆయన తెలియజేశారు. గవాయ్ వారసుడి ఎన్నిక పక్రియను కేంద్ర ఇటీవల ప్రారంభించిన నేపథ్యంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు సీనియర్ జడ్జిని సీజేఐ పదవికి ఎంపిక చేస్తారు. ప్రస్తుతం అత్యున్నత న్యాయస్థానంలో జస్టిస్ కాంత్ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్నారు. గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో దేశ 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు చేపడతారు. 2027 ఫిబ్రవరి 9వ తేదీ వరకూ ఆయన ఈ పదవిలో ఉంటారు. హర్యానాలోని హిస్సార్‌లో 1962 ఫిబ్రవరి 10న జస్టిస్ సూర్యకాంత్

..మిగతా 2లో

# మైనార్టీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం



**మొదటి పేజీ తరువాయి...**

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌తో పాటు మరో తొమ్మిది మంది ఎమ్మెల్యే పార్టీ మారారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను మీరు ఏ పార్టీలో ఉన్నారని వారిని అడగాలని.. వాళ్లు సమాధానం చెప్పలేరని విమర్శించారు. ఇదే విషయంపై కడియం శ్రీహరిని ప్రశ్నిస్తే.. 'ఎక్కడ ఉండాలో అక్కడే ఉన్నా' అని సమాధానం చెప్పారని.. ఇది వాళ్ల పరిస్థితి అంటూ ఎద్దేవా చేశారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు నింపే సంస్థలని రాహుల్ గాంధీ విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి బంధువుకు కేంద్రంలో కాంట్రాక్టులు వస్తాయని.. బదులుగా రేవంత్ రెడ్డి కూడా బీజేపీ నేతలకు లాభం చేకూరుస్తారని ఆరోపించారు. మోదీ తెచ్చిన చట్టాలను బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తొందరగా ఇక్కడ రేవంత్ అమలు చేస్తారని విమర్శించారు. ఇది బడే భాయ్ కోసం రేవంత్ రెడ్డి చేసిన పని అంటూ ఎద్దేవా చేశారు. మహిళలకు ఫ్రీ బస్ అని చెప్పి పురుషులకు టికెట్ రేట్ డబుల్ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ మాట తప్పిందని.. రెండేళ్లు అయిపోయాయి.. ఇంకో మూడేళ్లలో కూడా వీళ్లు చేసేది ఏమీ ఉండదని కేటీఆర్ విమర్శించారు. శంషాబాద్‌లో బీఆర్ఎస్ మైనార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.

కేసీఆర్ షాదీ ముబారక్ వంటి పథకాన్ని ప్రవేశపెట్టారు.. షాదీ ముబారక్ కింద రూ.లక్ష ఇస్తే.. మేం అంతకంటే ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ చెప్పిందని.. మైనార్టీలను కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌కుగా చూస్తోందని ఆరోపించారు. మైనార్టీ స్కూళ్లను కేసీఆర్ ప్రారంభించారని.. మైనార్టీ స్కూల్స్‌తో ఎంతో మంది విద్యార్థులు డాక్టర్లు అవుతున్నారన్నారు. నాలుగు ఉన్న మెడికల్ కాలేజీలు కేసీఆర్ 34కు పెంచారాని.. విద్యార్థులకు 20 లక్షల స్కాలర్‌షిప్ ఇచ్చారని.. పదేళ్లలో ఎన్నో పనులు చేశారన్నారు. మోదీ స్కూల్లో చదివానని.. చంద్రబాబు కాలేజీకి వెళ్లానని.. రాహుల్ దగ్గర ఉద్యోగం చేస్తున్నానని రేవంత్ బహిరంగంగానే చెబుతున్నారని.. చౌకీదార్ చోర్ అని రాహుల్ అంటే.. రేవంత్ రెడ్డి కాదు కాదు.. ఆయన నా పెద్దన్న అని చెబుతున్నాడన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి సంస్థలు మోదీ జేబు సంస్థలు అని విమర్శిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కాళేశ్వరం కేసు సీబీఐకి అప్పగిస్తారని.. ఒక సంవత్సరం క్రితం పొంగులేటి ఇంటిపై ఈడీకి రైడ్స్ అయ్యాయని.. ఒకటి కాదు రెండు రోజులు రైడ్స్ అయ్యాయని గుర్తు చేశారు. నోట్లు లెక్కపెట్టే మెషిన్‌లను లోపలికి తీసుకెళ్లిన దృశ్యాలు అంతా చూశారని. అంత జరిగిన తర్వాత ఏమైంది.. ఏమీ కాలేదు.. అంతా సైలెంట్ అంటూ విమర్శించారు.

## ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నాం

**మొదటి పేజీ తరువాయి...**

ముందుకెళ్లనుందని తెలిపారు. కొత్త డీపీఆర్ కోసం భౌగోళిక, సాంకేతిక, పర్యావరణ సర్వేలు మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ డీపీఆర్ పూర్తయ్యాక రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరు, హైదరాబాదుకు తాగునీరు సరఫరా సమతౌల్యంగా ప్రాజెక్టు రూపకల్పనపై దృష్టి పెట్టామని వెల్లడించారు. తక్కువ పొడవు ఉన్న కాలువలు, టన్నెల్‌లతో నిర్మాణ వ్యయం తగ్గనుందని వివరించారు. పంప్ హౌస్‌ల సంఖ్య 15 నుంచి 10కి తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఒక్క పంప్ హౌస్ 30మెగావాట్ల సామర్థ్యం ఉంటుందని స్పష్టం చేశారు. విద్యుత్ వినియోగం తగ్గి,నిర్వహణ సులభతరం కానుందని చెప్పుకొచ్చారు. సుందిల్లా లింక్ ద్వారా ప్రాజెక్టు పర్యావరణపరంగా సానుకూల మార్గంలో ముందుకెళ్లనుందని తెలిపారు. కొత్త డీపీఆర్ కోసం భౌగోళిక, సాంకేతిక, పర్యావరణ సర్వేలు మళ్లీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ డీపీఆర్ పూర్తయ్యాక రాష్ట్ర క్యాబినెట్ ముందుకు తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. తుమ్మిడి హట్టి బ్యారేజ్ ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు జరుపుతామని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా 12 లక్షల ఎకరాలకు నీరు, హైదరాబాదుకు తాగునీరు సరఫరా అందించడమ తమ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్ఘాటించారు.

## 'చమురు'పై అమెరికా ద్వంద్వ నీతి

**మొదటి పేజీ తరువాయి...**

ఈ వ్యాఖ్యలు చేశారు. ఓ వైపు సరఫరా గొలుసులు క్షీణిస్తున్నాయని, మరోవైపు ఇంధన మార్కెట్లు కుచించుకుపోతున్నాయని జైశంకర్ అన్నారు. మరోవైపు టెక్నాలజీ, సహజ వనరుల కోసం పోటీ వంటి కఠిన సమయాన్ని ప్రపంచం చూస్తోందని పేర్కొన్నారు. మార్కెట్‌లో నెలకొన్న అసాధారణ పరిస్థితుల కారణంగా ఇంధన వాణిజ్యం తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ తరుణంలో కొందరికి మాత్రమే నిబంధనలు వర్తింపజేయడం, ఇతరులకు నీతులు చెప్పేవారు వాటిని పాటించడం లేదంటూ పరోక్షంగా ట్రంప్ సర్కారుకు జైశంకర్ చురకలటించారు. అంతకుముందు మార్క్ రూబియోతో సమావేశమైన ఆయన ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు.

## మొంథా తుపాను..

**మొదటి పేజీ తరువాయి...**


మంత్రి తెలిపారు. మిగిలిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ రోజు వరకు 22,433 మంది రైతుల నుంచి ప్రభుత్వం 1,80,452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిందని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖాధికారులు సందర్శించి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలులో అవినీతి చోటు చేసుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.



మైలార్ దేవుపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

## మైలార్దేవుపల్లి ప్రాధమిక పాఠశాలను సందర్శించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

బుద్వేల్ అక్టోబరు 27 (నమస్తే ఉదయం) : మైలార్దేవుపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం కోసం జరుగుతున్న పనులను పాఠశాల ఉపాధ్యాయులకు వివరించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం ఎలా ఉంది అని ఆయన భోజనాన్ని పరిశీలించారు. చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ద్వారా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ తో మాట్లాడించి పాఠశాలకు కావాల్సిన మౌళిక సదుపాయాలను కల్పించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జవహార్ లాల్, ఉపాధ్యాయులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.




గుర్రపు స్వారీ లో బంగారు పతకం సాధించిన షిఫా అంజుమ్

## గుర్రపు స్వారీలో రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థినీ షిఫా అంజూమ్‌కు బంగారు పతకం

బుద్వేల్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం): తెలంగాణ స్టేట్ ఈక్వేస్ట్రీయన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ పోలో, రైడింగ్ క్లబ్ లో ఇటీవల నిర్వహించిన యంగ్ రైడర్ కాంపిటీషన్ లో వన్ (తెలంగాణ) ఆర్ అండ్ వీ రెజిమెంట్ ఎన్సీసీ నుంచి పాల్గొన్న రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ షిఫా అంజూమ్ కు బంగారు పతకం లభించింది. షిఫా అంజూమ్ గెలుపు తో అమ్మాయిలు కూడా గుర్రపు స్వారీ లో పాల్గొనవచ్చని నిరూపించారని నిర్వాహకులు గుర్తు చేశారు.



## సుప్రీంకోర్టు తదుపరి సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్

**మొదటి పేజీ తరువాయి...**

జన్మించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యారు. 370వ అధికరణ రద్దు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, అవినీతి, పర్యావరణం, లింగ సమానత్వం వంటి కీలక తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో ఆయన ఉన్నారు. ఎన్నికల జవాబుదారీతనంపై తన నిబద్ధతను చాటుకుంటూ బిహార్ ఓటర్ల జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది వివరాలను వెల్లడించాలని ఇటీవల ఎన్నికల కమిషన్‌ను ఆయన ఆదేశించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌తో సహా బార్ అసోసియేషన్లలో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వ్ చేయాలని చారిత్రక ఆదేశాలు సైతం ఇచ్చారు. 2022లో ప్రధాని నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో భద్రతా లోపాలపై దర్యాప్తునకు ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించిన ధర్మాసనంలో ఆయన కూడా ఉన్నారు. రక్షణ బలగాలకు ఓఆర్ఓపీ స్కీమ్‌ను సైతం ఆయన ధ్రువీకరించారు. పెగాసస్ స్పైవేర్ కేసును విచారించిన ధర్మాసనంలోనూ జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

## దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ

**మొదటి పేజీ తరువాయి...**

నవీకరించడం, ధృవీకరించడం, అనర్హులైన ఓటర్లను తొలగించడం, నిజమైన ఓటర్లను మాత్రమే జాబితాలో ఉంచడానికి ఎన్నికల కమిషన్ ఈ ప్రక్రియ చేపడుతోంది. ఎన్నికల జాబితా క్వాలిటీపై ప్రతి ఎన్నికలకు ముందు రాజకీయ పార్టీలు లేవనెత్తుతున్నందున ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడం అవసరమైందని సీఈసీ చెప్పారు. 1951 నుంచి 2004 వరకూ 8 సార్లు ఎస్ఐఆర్ నిర్వహించామని, చివరిసారిగా 21 ఏళ్ల క్రితం 2002-2004 మధ్య చేపట్టామని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల బిహార్‌లో తొలి విడత ఎస్ఐఆర్ పూర్తి చేసినట్టు చెప్పారు. ఎస్ఐఆర్ ఫేజ్-2 షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3 వరకూ ప్రింటింగ్/ ట్రైనింగ్ ఉంటుంది. నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకూ హౌస్ టు హౌస్ ఎన్యూమరేషన్ ఫేజ్ ఉంటుంది. హియరింగ్/వెరిఫికేషన్ ప్రక్రియ డిసెంబర్ 9 నుంచి 2026 జనవరి 31 వరకూ జరుగుతుంది. 2026 ఫిబ్రవరి 7న తుది ఎన్నికల జాబితా విడుదలవ్వుంది.రెండో విడత ఎస్ఐఆర్ జరుగనున్న రాష్ట్రాల్లో ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, గోవా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కేరళ, రాజస్థాన్ ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాల్లో అండమాన్ నికోబార్ ఐలాండ్స్, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి.



ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్

## విధి నిర్వాహణలో నిజాయితీగా పనిచేస్తాం

### వ్యవసాయ వర్శిటీ ఉద్యోగులు

బుద్వేల్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం) : విధి నిర్వాహణలో నిజాయితో కూడిన సేవలను అందిస్థాం... విధులు నిర్వాహణ లో పారదర్శకతను పాటిస్తాం... సహయం కోసం వచ్చే వారికి న్యాయ సూత్రాలకనుగుణంగా సేవలు అందిస్తామని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు, ఉద్యోగులు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. జాతీయ నిఘా అవగాహన వారోత్సవాలలో భాగంగా ఉద్యోగుల చేత వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జీఈసీహెచ్ విద్యాసాగర్ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. బాధ్యతతో విధులను నిర్వహిస్తామన్నారు. ఉద్యోగుల, ప్రజల హక్కులను కాపాడటానికి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఘనంగా చట్ పూజలు



పత్తి కుంట లో జరిగిన చట్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



నడుము లోతు నీళ్లలో ఉండి సూర్య భగవానుని కి పూజలు చేస్తున్న బీహారీ లు



నడుములోతు నీటి లో దిగి సూర్యభగవానునికి పూజలు చేసిన బీహారీ లు



బుద్వేల్, అక్టోబరు 27(నమస్తే ఉదయం) : రాజేంద్రనగర్ పత్తికుంట లో సోమవారం సాయం త్రం సూర్యుడు అస్తమించే సమయంలో బీహారీలతో పాటు తెలంగాణ లో స్థిరపడ్డ ఉత్తర భారతీయులు చట్ పూజ లు నిర్వహించారు. సూర్యస్థమయానికి ముందు కుటుంబ సభ్యులతో కలసి పత్తికుంట కు చేరుకున్న బీహారీలు, ఉత్తర భారత దేశానికి చెందిన ప్రజలు పూలు, పండ్లతో పత్తికుంట కొలను ను అలంకరించి నీళ్లలో నడుము లోతుకు దిగి సూర్యభగవానునికి పూజలు చేశారు. జలప్పూజ పేరుతో చేసిన ఈ పూజా కార్యక్రమంలో బీహారీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పంచభూతాలకు ప్రధానం సూర్య భగవానుడని, సూర్య భగవానుని ఆశీస్సులుంటే అంతా మేలే జరుగుతుందని బీహారీలు నమ్మకం. అందుకే సూర్యస్తమయంలో, సూర్యుడు ఉదయించే వేళలో చట్ పూజాలు చేయడం జరుగుతుందన్నారు.

**పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ :**

పత్తికుంట లో సోమవారం సాయంత్రం జరిగిన చట్ పూజలలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పడమటి శ్రీధర్రెడ్డి లు పాల్గొన్నారు. బీహారీ లు ఎంతో పవిత్రంగా నిర్వహించే చట్ పూజలలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సూర్యభగవానుని పూజించే ఈ పూజలకు ప్రత్యేకత ఉందన్నారు. వర్షాలు రావాలన్నా, సూర్యకాం తి ప్రకాశించాలన్నా, ప్రజలు చల్లంగా ఉండాలన్నా సూర్య భగవానుడే ప్రధాన కారణమని బీహారీలు నమ్ముతారన్నారు. అలాంటి పూజలలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**వీసీలో పాల్గొన్న కలెక్టర్**




మంత్రి తుమ్మలతో వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్,ఇతర అధికారులు

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే ఉదయం): రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ, గ్రామీణ అభివృద్ధి, రవాణా శాఖల అధికారులతో వరి ధాన్యం,పత్తి కొనుగోలు, అకాల వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్యాడి క్లీనర్లు, తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ ప్రక్రియ నిలిపి వేయాలని, హార్వెస్టింగ్ చేసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుందని, ఈ యాప్ లో కౌలు రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వరి ధాన్యం, పత్తి రైతులు తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని, తేమ శాతాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సరిహద్దు జిల్లాల వారు అప్రమత్తంగా ఉండాలని, బయట రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్, కందులు, పెసలు అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని, సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలను కవర్లను అందుబాటులో ఉంచాలని, ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు చర్యలు చేపట్టాలని, కపాస్ కిసాన్ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ వీసీ లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ బెన్న లోమ్, డిఆర్డిఓ వసంత, డిఏఓ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.



ఆలయ హుండీ లెక్కపెడుతున్న అధికారులు, భక్తులు

## శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ 11,26,292 రూపాయలు

**గత ఏడాది కంటే 1,47,070 రూపాయల ఆదాయం**

గద్వాల జిల్లా ప్రతినిధి(కేటిదొడ్డి) అక్టోబర్ 26(నమస్తే ఉదయం) కేటిదొడ్డి మండలంలోని వెంకటాపురంలో గల శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి పురేందర్, ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. భక్తులు సమర్పించిన కానుకలు, నగదు రూ.11,26,292 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. గత సంవత్సరం పోలిస్తే ఈ యేడాది రూ. 1,47,070 ఆదాయం వచ్చిందని ఈఓ పురేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వరమ్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లుట్ల ఆర్టీసి కాలనీ సమీపంలో లారీ, బైక్ ఢీ

**బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులలో ఒకరు మృతి మరొకరికి తీవ్ర గాయాలు**



జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం) : జిల్లాలోని లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామ శివార్లలో ఉన్న భ్రమరాంభ ఫంక్షన్ హాల్ సమీపంలో లారీ - ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. లింగాల ఘనపురం మండల ఎస్ఐ శ్రవణ్ కుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల గ్రామ ఆర్టీసి కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనం పై రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామానికి చెందిన రాగి సంజయ్ (19) తండ్రి వెంకటయ్య, లింగాల ఘనపురం మండలం నవాబ్ పేట గ్రామానికి చెందిన బూడిద ప్రసాద్ తండ్రి శ్రీనివాస్ లు బైక్ పై ప్రయాణిస్తూ జనగామకు వెళ్తుండగా జనగామ నుండి నెల్లుట్ల వైపు వెళ్తున్న సివిల్ సప్లై లారీ ఎదురుదుగా ఢీ కొన్న సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న రాగి సంజయ్ (19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడని, బూడిద ప్రసాద్ కు తీవ్ర గాయలైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.




రహ్మత్ నగర్ డివిజన్ లో ప్రచారం చేస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ బీజేపీ నాయకులు



జూబ్లీ హిల్స్ లో రాజేంద్రనగర్ బీజేపీ నాయకులు సులిగె వెంకటేష్, సూరెడ్డి వినయ్ రెడ్డి ల బృందం ప్రచారం

## జూబ్లీహిల్స్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

**ఎస్ వెంకటేశ్, సూరెడ్డి వినయ్ రెడ్డిలు**

రహ్మత్ నగర్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లంకల దీపక్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ అత్తాపూర్, మైలార్ దేవుపల్లి 2 డివిజన్ల అధ్యక్షులు ఎస్ వెంకటేష్, సూరెడ్డి వినయ్ రెడ్డి లు కోరారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహ్మత్ నగర్ డివిజన్ లో సోమవారం అత్తాపూర్, మైలార్దేపల్లి 2 డివిజన్ల బీజేపీ నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల కోసం చేస్తున్న సేవ ను చూసి జూబ్లీహిల్స్ లో బీజేపీ ని గెలిపించాలని కోరారు.



డీజీపీ బి శివధర్ రెడ్డి ని కలిసి వినతి పత్రం అందచేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిధులు

## క్రిస్మస్ క్యారెల్స్ నిర్వహించుకోవడానికి అనుమతులు ఇచ్చి రక్షణ కల్పించాలి

బుద్వేల్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం) : క్రిస్మస్ మాసంలో క్రైస్తవులు నిర్వహించే క్యారెల్స్ కు అనుమతులు ఇవ్వాలని, ప్రార్థన మందిరాల (చర్చ్) వద్ద పార్కింగ్ చేసే వాహనాలకు చలాన్లు విదించరాదని, క్రైస్తవ సంఘాలు, పాస్టర్ల గురించి యూట్యూబ్ చానెల్స్ లో అనుచితంగా ప్రసారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రదాన కార్యదర్శి గోనే సోలోమన్ రాజ్ కోరారు. ఈ మేరకు సోమవారం తెలం గాణ రాష్ట్ర డీజీపీ బి.శివధర్ రెడ్డి ని సంఘం కార్యవర్గ సభ్యులు రెవరెండ్ పి.జయప్రకాశ్, రెవరెండ్ కె డానియెల్, టి.సోలోమన్ రాజు, కె అహినోమ్ లతో కలసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోనే సోలోమన్ రాజు మాట్లాడుతూ, యూట్యూబ్ చానెల్ లో మతాల మద్య చిచ్చుపెట్టే విదంగా ప్రసారాలు, డిబేట్ లు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. క్రైస్తవ సంఘాల కు రక్షణ కల్పించాలని కోరారు. సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ ల పరిధిలోని ప్రార్థన మందిరాల వద్ద పార్కింగ్ చేసే వాహనాలకు చలాన్లు విదించవద్దన్నారు. క్రిస్మస్ మాసంలో క్రైస్తవ విశ్వాసుల ఇళ్లలోకి వెళ్లి రాత్రి వేళలలో క్యారెల్స్ నిర్వహించడం జరుగుతుం దని,వాటికి అనుమతులు ఇవ్వాలని, రక్షణ కల్పించాలని కోరారు.



మద్యం షాప్ లకు డ్రా తీస్తున్న జిల్లా కలెక్టర్

## జనగామ జిల్లా (50) మద్యం దుకాణాలు లక్కీడ్రా పద్ధతిని కేటాయింపు

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే ఉదయం): 2025- 27 సంవత్సరానికి గాను జనగామ జిల్లాకు సంబంధించిన మొత్తం (50) మద్యం దుకాణాలు కేటాయింపునకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆధ్వర్యంలో లక్కీ డ్రా ద్వారా కేటాయించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జనగామ డిసిపి రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పి పండరీ చేతన్ నితిన్ ఐపిఎస్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కె అనిత ,అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ ఆర్ ప్రవీణ్ , ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్లు, బి ప్రభావతి, జి భాస్కరరావు, బి సంతోష్ రెడ్డి ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దే పత్తి విక్రయించాలి:

**ప్రవేట్ వ్యాపారస్తులు పత్తిని కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తప్పవు**

**మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్**



జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే ఉదయం): జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో గల పత్తి రైతులకు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకువచ్చిన కాపస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని దగ్గరలో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దనే తమ పత్తిని విక్రయించి ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర 8110 పొందాలని, సోమవారం ఒక ప్రకటన లో చూచించారు. సిసిఐ నిబంధనకు అనుకూలంగా తేమ శాతంతో నాణ్యమైన పత్తిని తీసుకెళ్లి విక్రయించాలన్నారు ముఖ్యంగా దళారులను నమ్మి తక్కువ ధరకు పత్తి అమ్మ వద్దు అని రైతులను కోరారు.సీసీఐ నిబంధనలకు అనుగుణంగా ఉన్న పత్తిని సిసిఐ కేంద్రంలో ఎవరైనా అవకాతవకలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడుతయాన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రంలో ఎవరైనా కావాలని రైతులను మోసం చేస్తే అట్టి కేంద్రం పై చట్టరీత్యా చర్యలు ఉంటాయన్నారు..పత్తి రైతులకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా సీసీఐ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందని, ఏ రైతుకైనా ఎక్కడ ఇబ్బంది జరిగిన నేరుగా మార్కెట్ పాలక వర్గాన్ని సంప్రదించవచ్చు అని తెలిపారు.జనగామ లో చిల్లర కాంటలు అన్ని మూసి తలాలు వేసి మూసేశామని, ఒక వేళ ప్రవేట్ వ్యాపారస్తులు పత్తి ని కొనుగోలు చేస్తే కఠిన చర్యలుతీసుకుంటామని, ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ హెచ్చరించారు .



జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ తోప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ఖాయం

**పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

జనగామ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27(నమస్తే ఉదయం): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు తపనగా కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి బోరాబండా డివిజన్ పరిధిలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, మైనారిటీ నేతలు, యువజన కాంగ్రెస్ సభ్యులు భారీగా పాల్గొన్నారు.బోరాబండ ప్రాంతంలోని ముస్లిం సోదరులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ని ఆత్మీయంగా ఆహ్వానించి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కి వారి నేతృత్వంలో తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ప్రజల గెలుపు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని, అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం ఇవే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయాలని, ఈ అభివృద్ధి యాత్ర కొనసాగాలంటే నవీన్ యాదవ్ ని గెలిపించాలని పిలుపునిచ్చారు. నవీన్ యాదవ్ యువత, ప్రజల మనసును చదివిన నాయకుడు. ఆయనకు ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని. ప్రతి ఓటరు ఈసారి కాంగ్రెస్ పట్ల నమ్మకాన్ని ఓటు రూపంలో వ్యక్తం చేస్తే జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండా ఖచ్చితంగా ఎగురుతుందని నమ్మకం వ్యక్తం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో బోరాబండా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ కోర్టుకు వెళ్లే దారిలో రోడ్డుపై పారుతున్న మురుగునీటిని సమస్యను పరిష్కరించాలి

**ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు హేమ సుదర్శన్ జిల్లోజు**




ఉప్పర్ పల్లి లోని రాజేంద్రనగర్ కోర్టు కు వెళ్ళే దారి లో రోడ్డుపైన పారుతున్న మురుగు నీటి ని చూపుతున్న ఆప్ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు

బుద్వేల్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం): ఉప్పర్పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టులకు వెళ్లే దారిలో రోడ్డ వేశారని, డ్రైనేజీ కాలువ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు అంతా రోడ్డుపైనే పారుతుం దని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు అన్నారు. సోమవారం కోర్టు సమీపంలోని రోడ్డులో పారుతున్న మురుగునీటి ప్రవాహాన్ని ఆమె స్థానికులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా హేమ సుదర్శన్ జిల్లోజు మాట్లాడుతూ, రెం డు నెలల క్రితం కోర్టుకు వెళ్లే దారి అధ్వాన్నంగా, బురద మయంగా ఉందని తాను అధికారులకు తెలియజేసేటట్లు పర్యటన చేస్తే రోడ్డు వేశారని గుర్తు చేశారు. భూ గర్భ డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయలేదన్నారు. కోర్టుకు సమీపంలో నూతనంగా దేవాలయాన్ని నిర్మించారని, భక్తులు కూడా మ రుగునీటిని తొక్కుకుంటు దేవాలయం లోకి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రతి రోజు కోరుకు వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారని, ఆ రోడు అద్వాన్నంగా ఉండటం చూసి ఇక్కడున్న ప్రజా ప్రతినిధులు ఏమి చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారన్నారు. ఇప్పటికైన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఉప్పర్పల్లిలోని రాజేంద్రనగర్ కోర్టుకు వెళ్లే దారిని పరిశీలించి మ రుగునీరు నిల్వకుండ జాగ్రత్తలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు కోరారు.

# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవం

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 18 (నమస్తే ఉదయం) సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలు - దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోను ఐక్యతా పాద యాత్రలు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలలో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించే ఐక్యతా పాద యాత్రల పై సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా యువజన అధికారి ఐసయ్య తో కలిసి పాత్రికేయులతో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సహాకారలతో, కేంద్ర ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మేరా యువ భారత్, జాతీయ సేవ పథకం శాఖల ద్వారా, సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా మునుపెన్నడు నిర్వహించని విధంగా యువతను భాగస్వామ్యం చేస్తు, భవిష్యత తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచేలా పలు కార్యక్రమలను నిర్వహించుటకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వార మన దేశ స్వాతంత్ర్యం, పునర్నిర్మాణంలో భాగస్వామ్యులైన త్యాగధనులను స్మరించుకుంటూ, యువతలో ఐక్యతా భావం మరింత బలోపేతం చెయ్యడం లక్ష్యంగా, గౌరవ భారత దేశ ప్రధాని నరేంద్ర మోడి గారి "వికసిత్ భారత్"



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఉత్సవ పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

ఆలోచనలకు అనుగునంగా రూపొందించబడిన ఈ కార్యక్రమం ద్వార భారత జాతి నిర్మాణంలో శ్రమించిన జాతీయ నాయకులకు ఘన నివాళి ఆర్పించనుంది. దేశవ్యాప్తంగా గల యువతీ యువకులు My Bharat.Gov.in websiteలో తమ వివరాలు నమోదు చేసుకొని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. జిల్లా కలెక్టర్, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ సభ్యులు, జిల్లా మంత్రిఅందరి భాగస్వామ్యంతో ప్రతి పార్లమెంట్ నియోజక వర్గంలో గౌరవ లోకసభ, పార్లమెంట్ సభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొని ఐక్యతా పాదయాత్ర నిర్వహించనున్నారని. ప్రతి పాదయాత్ర 8 నుంచి 10 కి.మీ సాగేలా ప్రణాళిక రూపొందించి అక్టోబర్ 31 నుంచి నవంబర్ 25 మధ్య నిర్వహించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో రెండు విడుతలు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఇందులో జిల్లా కలెక్టర్, అధికారులు, క్రీడకారులు, ప్రజాప్రతినిధులు, పాఠశాల/కళాశాల విద్యార్థులు, పౌరులు పాల్గొంటారని తెలిపారు.


అక్టోబర్ 10 నుంచి నవంబర్ 2 వరకు జాతీయ స్థాయిలో వ్యాసరచిన (250 పదాలు మించకుండ) లఘుచిత్ర పోటీలు (20 నుంచి 30సెకండ్లు మించకుండ మరియు క్విజ్ పోటీలను My Bharat.gov.in website% ద్వార నిర్వహిస్తున్నారు. 01-10-2025 నాటికి 15 సంవత్సరాలు పైబడి 29 సంవత్సరాలు లోపు వయస్సు గల యువతి యువకులు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులని అన్నారు. నవంబర్ 3 నుంచి 20 మధ్య రాష్ట్ర స్థాయిలో ఎంపికలు చేసి, నవంబర్ 21 నుంచి 24 మధ్య అధికారికంగా ప్రకటిస్తారు. నవంబర్ 26న జాతీయ స్థాయి విజేతలను ప్రకటిస్తారు. ఈ పోటీల ద్వారా జాతీయ స్థాయిలో ఎంపికైన 150 మందికి కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రి తో కలిసి జాతీయ ఐక్యతా పాదయాత్రలో పాల్గొనే అవకాశం కల్పిస్తారని, ఈపోటీలలో పాల్గొన్న అందరికి ప్రశంసా పత్రం, మై భారత్ కిట్ అందిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారి ఐసయ్య, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.సి.వెంకటేశం, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు మణిభూషన్ చౌదరి, ఎన్.మల్లారెడ్డి, నరేష్ యాదవ్, గూడూర్ అవినాష్ రెడ్డి, ఆర్.కె పురం సంతోష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మరకత లక్ష్మీ గణపతి దేవాలయంలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు. కార్తీక మాసంలో

## కామాజిగూడ గణపతి దేవాలయంలో కార్తీక మాసం పూజలు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) అక్టోబర్ 27 ( నమస్తే ఉదయం )కామాజిగూడ గణపతి దేవాలయంలో సోమవారం మరకత లక్ష్మీ కార్తీక మాసం మొదటి సోమవారం జగద్గురువు ఆదిశంకరాచార్య అర్చిత మహా స్పటిక లింగానికి భక్తులచే ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హెూమం, మహా పూర్ణాహుతితో పాటుగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వ్యవస్థాపకులు మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి స్వామివారికి ప్రత్యేక పూజలు స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమము లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## నేడు పేదల దేవుడు శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి ఉద్దాల మహెూత్సవం




చిన్న చింతకుంట, అక్టోబర్ 27(నమస్తే ఉదయం) ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలు పేదల దేవుడిగా కొలిచే శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి ఉద్దాల మహెూత్సవం మంగళవారం జరగనుంది.అమ్మాపూర్ సంస్థాన దీషుల నేతృత్వంలోఆచారం కు అనుగుణంగా అనాదిగా వస్తున్న సాంప్రదాయబద్ధంగా ఉదయం 8:00 గంటలకు ఉద్దాల మహెూత్సవం కొనసాగుతుంది. ఈ సందర్భంగా పల్లమరి గ్రామంలో (ఉద్దాల చాట) పూజ కార్యక్రమం, అనంతరం మధ్యాహ్నం 1-00 గంటలకు చిన్న వడ్డేమాన్ గ్రామంలో ఉద్దాల కార్యక్రమం, అనంతరం సాయంత్రం కురుమూర్తి స్వామి జాతర మైదానంలోని ఉద్దాల మండపం వద్ద ఉద్దాలకు ప్రత్యేక పూజ కార్యక్రమ్నా నిర్వహిస్తున్నారు.

### జానపదుల గాథల్లో కురుమూర్తి స్వామి

కురుమూర్తి ఆలయం 13వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో నేటి మక్తల్గా పిలవబడుతున్న మగతలనాడుని పాలిస్తున్న ముక్కెర గోపాల్ రెడ్డి కాలంలో వెలుగు చూసింది. అప్పటికి ఇంకా సంస్థానం ఏర్పడలేదు. అయినప్పటికీ స్థానిక పసుల కాపర్లు, గొర్రెల కాపర్లు గుట్ట మీద గుహలో కురుమతి రాయుడిని పూజిస్తున్నట్టుగా జానపద ఆధ్యాత్మిక కథలు ప్రచారంలో ఉన్నాయి. కాబట్టి రాజుల కాలానికి ముందే జానపదుల గాథలు ప్రచారంలో ఉన్నాయనేది స్పష్టమవుతుంది.


అల్వాల్ సర్కిల్లో జరిగిన ప్రజావాణిలో వినతిపత్రం అందించిన కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ ప్రజలకు

## ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తా

### డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి

### ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి: కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( అల్వాల్ సర్కిల్ ) అక్టోబర్ 27 ( నమస్తే ఉదయం ) సోమవారం అల్వాల్ సర్కిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో పలువురు కాలనీవాసులతో పాటు మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్ లు ఆయా సమస్యలపై డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్ మాట్లాడుతూ కార్యకర్తలతో కలిసి మౌలిక వసతులను కల్పించాలని వినతి పత్రం ద్వారా విన్నవించామని చెప్పారు. డివిజన్ పరిధిలోని కాలనీలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టి సమస్యలకు పరిష్కార మార్గం చూపాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వేశ్ యాదవ్ రాజు తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్సీ కుటుంబాన్ని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

జల్ పల్లి,అక్టోబర్27( నమస్తే ఉదయం) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల జమాత్ ఉలెమా అధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్సీ మౌలానా హాఫీజుపీర్ షబ్బీర్ కుటుంబాన్ని పరామర్శించారు.రాష్ట్ర కమిటీ చైర్మన్ గా పనిచేసి,ముస్లిం మైనారిటీ వర్గాల సంక్షేమం కోసం,విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేసిన మౌలాన హాఫీజ్ ఇటీవలే అనారోగ్య కారణాలతో మరణించారు.జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని షాహినగర్ లో ఉన్న హాఫీజ్ పీర్ షబ్బీర్ నివాసానికి వెళ్లి,వారి కుటుంబ సభ్యులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించి,సంతాపం తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.


ఛఠ్ పూజ వేడుకలో పాల్గొన్న రవి కుమార్ యాదవ్ ఇతర నాయకులు.

## శేరిలింగంపల్లిలో ఘనంగా ఛఠ్ పూజ మహెూత్సవం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం) అందరికి ఆరోగ్యం తోపాటు తమ భర్తలకు విజయం దీర్ఘాయువును ఇవ్వలని మహిళలు సూర్య భగవానుడిని కోరుతూ ఛఠ్ పూజ మహెూత్సవాన్ని శేరిలింగంపల్లి లోని పలు ప్రాంతాలలో ఘనంగా నిర్వహించారు. ఛఠ్ పూజ కార్యక్రమానికి బీజేపీ శేరిలింగంపల్లి అసెంబ్లీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ఇంఛార్జి రవికుమార్ యాదవ్ పాల్గొన్ని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. శేరిలింగంపల్లి లోని హాఫీజ్ పేట్ విలేజ్,గంగారం, నలగండ్ల గ్రామంలో నిర్వహించిన ఛఠ్ పూజ మహెూత్సవ కార్యక్రమంలో రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ పంచభూతాలలో సూర్య భగవానుడికి భగవానుడికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రత్యక్ష దైవంగా భూమ్మీద మనకు మనుగడ కల్పిస్తున్న సూర్య భగవానుడికి కృతజ్ఞతలు తమ తమ మాంగళ్యం బలంగా ఉండి భర్తలకు దీర్ఘాయుష్ కల్పించాలని మహిళలు సూర్య భగవానుడికి పూజలు చేస్తారని తెలిపారు. సూర్య భగవానుని పూజించి ఆరాధించడమే ఛఠ్ పూజని మన ఆయుస్సుకు ప్రకృతి జీవ జాతులు పశుపక్ష్యాదులు ఇలా అన్ని భూమి మీద ఉండే ప్రతి ఒక్కరికి మనుగడ కల్పిస్తున్న సూర్య భగవానుడికి పూజ ద్వారా తెలియజేయడం చాలా సంతోషకరమైన సంప్రదాయమని అన్నారు. మనందరికి ఆరోగ్యం విజయం దీర్ఘాయువు ఆ సూర్య భగవానుడు అందించాలని కోరుతూ ఛఠ్ పూజ మహెూత్సవ జరుపుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, రాధాకృష్ణ యాదవ్, శ్రీనివాస్, దేవాల్ యాదవ, నందగోపాల్ యాదవ్, పవన్, రాజేష్, సత్యనారాయణ, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు


అధికార భాష అమలు తీరు పై తెలుసుకుంటున్న అధికారులు

## ఐఐఎంఆర్‌లో అధికార భాషను ప్రోత్సహిస్తున్నారా

బుద్వేల్, అక్టోబరు 27 (నమస్తే ఉదయం) : అధికార భాష అయిన హిందీని అమలు చేసు న్నారా.. లేదా అనే వివరాలు తెలుసుకోవడానికి సోమవారం బెంగుళూరు కు చెందిన అఫిషీయల్ లాంగ్వేజ్ రీజినల్ ఇంప్లిమెంటేషన్ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ విశ్వాస్ రాజేంద్రనగర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్ రీసెర్చ్ ( ఐఐఎంఆర్ ) ను సందర్శించారు. ఆయనకు ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి స్వాగతం పలికి సంస్థలో చేపడుతున్న హిందీ భాష అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సంస్థకు చెందిన డాక్టర్ బి.వెంకటేశ్ భట్, డాక్టర్ జినుజాకబ్. డాక్టర్ సూగన్న, షేక్ రుక్మాన్, పి.శివ ప్రసాద్, రామ్మూర్తి, డాక్టర్ మహేశ్ కుమార్ లతో ఆయన ఐఐఎంఆర్ లో హిందీ బాష ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు.

### నిఘా వారోత్సవాల సందర్భంగా ప్రతిజ్ఞ చేసిన ఉద్యోగులు :

నిఘా వారోత్సవాల సందర్భంగా ఐఐఎంఆర్ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు నిస్వార్థంగా విధులను నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు. తమకప్పగించిన భాధ్యతలను ఎలాంటి అవినీతి లేకుండ చేపడుతమన్నారు. వారి చేత ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి ప్రతిజ్ఞ చేయించారు.




## "స్థిరమైన ఉత్పాదకత కోసం స్మార్ట్ సీడ్స్"

రాజేంద్రనగర్, అక్టోబర్ 27 (నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ లోని నూనె గింజల పరిశోధన కేంద్రంలో "స్థిరమైన ఉత్పాదకత కోసం స్మార్ట్ సీడ్స్" పై పరిశ్రమ-విద్యారంగం-ఇంటర్‌ఫేస్- మల్టీ-ఇన్‌పుట్ డెలివరీ అప్రోచ్ కోసం సీడ్ బయోపాలిమర్-ఆధారిత మల్టీలేయర్ సీడ్ కోటింగ్ అంశంపై కార్యక్రమం జరిగింది. ఐ సి ఏ ఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ రీసెర్చ్, ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ కె మాథుర్ నాయకత్వంలో, బయోపాలిమర్-ఆధారిత మల్టీలేయర్ సీడ్ కోటింగ్ ఫర్ మల్టీ-ఇన్‌పుట్ డెలివరీ అప్రోచ్ - "స్థిరమైన ఉత్పాదకత కోసం స్మార్ట్ సీడ్స్" పై ఒక రోజు సీడ్ ఇండస్ట్రీ-అకాడెమియా-ఇంటర్‌ఫేస్‌ను నిర్వహించింది. ఐ సి ఏ ఆర్ జి, ఐ ఐ ఓ ఆర్ ఒక వినూత్న బయోపాలిమర్-ఆధారిత మల్టీలేయర్ సీడ్ కోటింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది, ఇది బహుళ పంట ఇన్‌పుట్‌లు-పంట రక్షణ రసాయనాలు, సూక్ష్మజీవుల బయో ఏజెంట్లు, పోషకాలు పెరుగుదల ఉద్దీపనలను-పొరల వారీగా వ్యూహాన్ని ఉపయోగించి వరుస పొరలలోకి అనుసంధానిస్తుంది. ఈ ఇంటర్‌ఫేస్ విత్తన పరిశ్రమ నాయకులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, ఐ సి ఏ ఆర్, సాంకేతిక భాగస్వాములను కలిసి జ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడానికి, భాగస్వామ్యాలను అన్వేషించడానికి , ఈ ఆవిష్కరణను పెద్ద ఎత్తున స్వీకరించడానికి మార్గాలను చర్చించడానికి తీసుకువచ్చింది, పరిశోధన , క్షేత్ర అమలు మధ్య అంతరాన్ని తగ్గించడం, స్మార్ట్ సీడ్ టెక్నాలజీలు రైతులకు సమర్థవంతంగా , స్థిరంగా చేరేలా చూడటం ప్రధాన లక్ష్యం.ఈ కార్యక్రమంలో విత్తనం , ఎరువుల ఇన్‌పుట్‌లు, ఎన్ డి డి బి, కె ఆర్ ఐ బి హెచ్ సి ఓ, ఇఫ్కో అనేక ప్రైవేట్ విత్తన పరిశ్రమ సంస్థలు, నూజివీడు విత్తనాలు, యదుక టెక్నాలజీస్, అడ్వాంటా విత్తనాలు, సిద్ధగంగ ఆయిల్ , బయో ఇండస్ట్రీస్ లిమిటెడ్ మొదలైన వాటితో సంబంధం ఉన్న ప్రధాన ప్రభుత్వ సంస్థల నుండి దాదాపు 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఇంటర్‌ఫేస్ సమావేశానికి ఐ సి ఏ ఆర్ ఏ డి జి (ఓ పి) చీఫ్ గెస్ట్ డాక్టర్ సంజీవ్ గుటా అధ్యక్షత వహించారు విత్తన చికిత్స ద్వారా రైతుల సాధికారతకు విత్తన సాధికారత ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఈ సాంకేతికత ప్రధాన దేవలపర్లు డాక్టర్ ఆర్ డి ప్రసాద్ డాక్టర్ కె ఎస్ వి పి చంద్రిక వివరణాత్మక ప్రజెంటేషన్ ఇచ్చారు . పాల్గొనేవారి నుండి ప్రశ్నలను స్పష్టం చేశారు. కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ దండ రాజి రెడ్డి గౌరవ అతిథిగా వ్యవహరించారు, ప్రముఖ భారతీయ విత్తన రంగ నిపుణులు, ధార్వాడ్‌లోని యూఏఎస్ మాజీ ఉపకులపతి డాక్టర్ ఆర్ ఆర్ హంచినాల్ , గ్వాలియర్‌లోని ఆర్ వి ఎస్ కే వి వి మాజీ వీసీ ఆర్ ఎ సి, ఐ ఐ ఓ ఆర్ చైర్మన్ డాక్టర్ ఎస్ కె రావు ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హాజరయ్యారు %శ్రీ%. విత్తన పరిశ్రమ భాగస్వాములు బయో పురుగుమందుల పరిశ్రమ ఆటగాళ్లతో ఆకర్షణీయమైన చర్చలలో పాల్గొన్నారు. ఐ ఐ ఓ పి ఆర్ డైరెక్టర్ డాక్టర్ కె సురేష్ , ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకు డాక్టర్ బలరాం, శ్రీ బయో ఎండిడాక్టర్ కెఆర్ కె రెడ్డి , ప్రైవేట్ ప్రభుత్వ పరిశ్రమల నుండి వచ్చిన ఇతర ప్రముఖులు ఇంటర్‌ఫేస్ సమావేశంలో పాల్గొని, బయో పాలిమర్ ఆధారిత వ్యవసాయ ఇన్‌పుట్ డెలివరీ వ్యవస్థను వ్యవసాయ సమాజానికి విస్తృత స్థాయిలో తీసుకెళ్లడం , ప్రయోజనాలను సాధించడంలో తమ విలువైన ఇన్‌పుట్‌లను అందించారు. టెక్నాలజీ బదిలీల కోసం మెస్సర్స్ యదుకా అగ్రో టెక్ లిమిటెడ్ మరియు మెస్సర్స్ విజేత అగ్రిటెక్‌తో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు.


మద్యం షాపుల డ్రా టోకెన్ చూపిస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

## పారదర్శకంగా మద్యం షాపుల లక్కీ డ్రా

### కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 (నమస్తే ఉదయం) రంగారెడ్డి జిల్లాలో మద్యం షాపులకు లక్కీ డ్రా ద్వారా ఎంపిక జరిగింది. సోమవారం శంషాబాద్ లోని మల్లికా గార్డెన్ లో జరిగిన మద్యం షాపుల లక్కీ డ్రా ను కలెక్టర్ నారాయణరెడ్డి నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి 2025-2027 సంవత్సరాలకు రంగారెడ్డి జిల్లాలో మొత్తం 249 %గూ%4 మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి లాటరి పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకంగా కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. సరూర్ నగర్ యూనిట్ 138 , శంషాబాద్ యూనిట్ 111 రిటైల్ మద్యం దుకాణాలఎంపిక కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ్ రెడ్డిముఖ్య అతిథిగా హాజరై సరూర్ నగర్ యూనిట్ 138 లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ శంషాబాద్ యూనిట్ 111 లాటరీ ద్వారా మద్యం దుకాణాలను కేటాయించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పూర్తి పారదర్శకతతో మద్యం దుకాణాల లాటరీ నిర్వహించడం జరిగిందన్నారు. రంగారెడ్డిజిల్లా ఎక్సైజ్ యూనిట్ పరిధిలో మొత్తం 249 %గూ%4 షాపులు ఉండగా, అందులో సరూర్ నగర్ ఎక్సైజ్ యూనిట్ 138 మద్యం దుకాణాలకు సంబంధించి 7,845,శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ 111 మద్యం దుకాణాలకు సంబంధించి 8,536 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లాలోని మద్యం షాపులను పారదర్శకంగా లాటరీ ద్వారా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ అబ్కారీ మద్యనిషేధ శాఖాధికారి ఉజ్వల రెడ్డి, శంషాబాద్ అబ్కారీ మద్యనిషేధ శాఖాధికారి కృష్ణప్రియ పర్యవేక్షణలో మద్యందుకాణాల ఎంపిక జరిగింది.


మద్యం షాపుల లక్కీ డ్రా లో పాల్గొన్న దరఖాస్తుదారులు

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699.** Cell: 9492148733